

కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని

కమ్యూనిటీహాల్ అభివృద్ధికి చర్యలు

చిక్కడపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావని తెలిపారు. సోమవారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి కమ్యూనిటీ హాల్‌ను సందర్శించారు. కమ్యూనిటీహాల్‌లో కరెంట్ వైరింగ్, మరగుదొడ్ల మరమ్మతు, నల్లాలు, గేటు ఏర్పాటు తదితర పనులకు సంబంధించి జోనల్ కమిషనర్‌కు నివేదిక అందజేశామని, పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, నాయకులు ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్, కల్యాణమండపం కమిటీ సభ్యులు ఎన్.మల్లేష్, మారిశెట్టి నర్సింగ్‌రావు, జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో వ్యర్థాలను తొలగించాలి



డ్రైనేజీ వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీల్లో వ్యర్థాల తొలగింపునకు జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె. రవిచారి సూచించారు. సోమవారం ఆయన బాకారం, హరినగర్, శివస్థాన్‌పూర్‌లో పాదయాత్ర చేశారు.

జలమండలి సిబ్బంది చేపడుతున్న డ్రైనేజీ వ్యర్థాల తొలగింపును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డివిజన్‌లో డ్రైనేజీ లీకేజీల సమస్యను పరిష్కరించాలని సూచించారు.

అయోధ్యలో జాంబవంతుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి



మాట్లాడుతున్న మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌రాజ్

ముషీరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయంలో జాంబవంతుడి విగ్రహం ప్రతిష్ఠించాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి. నవీన్‌రాజ్ డిమాండ్ చేశారు. సోమవారం భోలక్‌పూర్‌లో సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్ తరాలకు జాంబవంతుడి చరిత్ర తెలిసేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ జిల్లాలో జాంబవంతుడి విగ్రహం ప్రతిష్ఠించాలని కోరారు. ఏపీ నెల్లూరు జిల్లాలో ఉన్న జాంబవంతుడి దేవాలయాన్ని పునర్‌నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాదిగ రాజ్యాధికార పోరాట సమితి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లేష్, మాదిగ విద్యార్థి ఫెడరేషన్ నగర అధ్యక్షుడు ప్రవీణ్ జయరాజు తదితరులు



మాట్లాడుతున్న కృష్ణప్రదీప్

సివిల్ సర్వీస్ పరీక్షలపై అవగాహన

రాంనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీస్ పరీక్షల ప్రిపరేషన్‌పై అవగాహన సదస్సును విద్యానగర్‌లోని స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఛైర్మన్ కృష్ణప్రదీప్ పాల్గొని మాట్లాడారు. సబ్జెక్టులపై అవగాహన ఉంటే సివిల్ సర్వీస్‌లో ఉద్యోగం సాధించవచ్చన్నారు. భారత రాజ్యాంగాన్ని అధ్యయనం చేయాలని, దేశ చరిత్ర, ఆర్థిక, రాజకీయ, ప్రభుత్వ పాలన శాస్త్రాలపై అవగాహన ఉండాలన్నారు. ప్రతిరోజూ 10 నుంచి 12 గంటలు చదవాలని సూచించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఐఏఎస్ శిక్షణ తరగతుల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బంగ్లా భారతి, డాక్టర్ అవినాష్ రాజేష్, జె.శ్రీదేవి, వి.నర్సింగ్‌రావు, ఎస్.రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మధుయాష్కీగౌడ్‌ను కలిసిన ఎరుకల ఏకలవ్య జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి తదితరులు

నామినేటెడ్ పదవుల్లో ఎరుకలకు అవకాశం కల్పించాలి

రాంనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో ఎరుకల ఏకలవ్య కులానికి చెందిన వారికి అవకాశం కల్పించాలని ఎరుకల ఏకలవ్య జేఏసీ చైర్మన్ సుల్తాన్‌యాదగిరి కోరారు. సోమవారం సంఘం నేతలతో కలిసి టీపీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను కలిసి విన్నవించారు. కార్యక్రమంలో ఎరుకల ఏకలవ్య జేఏసీ కో-చైర్మన్‌లు కె. కృష్ణ, బుడ్డ సత్యనారాయణ, భావనపురం రఘు, శ్రీరాములు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తమిళుల ఆత్మగౌరవ భవనం నిర్మించాలి

రాంనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆత్మగౌరవ భవనం నిర్మించాలని తెలంగాణ తమిళ సంఘం అధ్యక్షుడు ఎంకే బోస్ కోరారు. సోమవారం తెలంగాణ తమిళ సంఘం ఆధ్వర్యంలో మహిళా సదస్సు రాంనగర్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నగరంలో అనేక సంవత్సరాలుగా నివసిస్తున్న తమిళులకు ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యా సంస్థల్లో తమిళ భాష నేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తమిళ మహిళా సంఘం నేతలు కాణిశీలం, అరుణకుమారరాజన్, వసుదమోహన్, ప్రేమసర్వమాన్, పావని, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న మహిళలు

న్యాయం కోసం

50 రోజుల నుంచి దీక్షలు



కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న బాధితులు

చిక్కడపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): న్యాయం చేయాలంటూ స్వామి వివేకానంద నగర్ బస్తీ బాధితులు 50 రోజుల నుంచి పోరాటం చేస్తున్నారు. సోమవారం రాత్రి ఇళ్లను కూల్చివేసిన చోట కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు ఎంటీ కృష్ణ, నరేష్, జ్ఞానేష్, ఆనందరావు, వసంత్ మాట్లాడుతూ.. అన్యాయంగా తమ ఇళ్లను కూల్చివేసి రోడ్డుపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 రోజుల నుంచి నిరసన, రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రజా ప్రతినిధులు, అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. బాధితులు సాయిరామ్, సువర్ణ, సునీత, ఇందు, భాగ్యలక్ష్మి, పూజారేఖ, లలితతోపాటు పలు సంఘాలు, రాజకీయపక్షాలు, దళిత సంఘాల నేతలు సాయికుమార్, అరుణ్, ఆయుష్, సుధీప్, మైఖేల్, నమిత పాల్గొన్నారు.

పది పరీక్షలకు 12 మంది గైర్హాజరు



ముషీరాబాద్‌లో పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్లు చూపిస్తున్న విద్యార్థులు



చిక్కడపల్లిలో విద్యార్థినులకు సూచనలిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

ముషీరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సోమవారం ముషీరాబాద్ మండల పరిధిలో 23 కేంద్రాల్లో 4,878 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 12 మంది గైర్హాజరయ్యారు. తల్లిదండ్రులు పిల్లలకు ధైర్యం చెప్పి పరీక్ష కేంద్రాలకు పంపించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు. చిక్కడపల్లిలో ఓ పరీక్షా కేంద్రం వద్ద ఇన్‌స్పెక్టర్ సీతయ్య విద్యార్థులకు సూచనలు ఇచ్చారు.

ప్రత్యేక కార్పొరేషన్ కోసం నిరసన

కవాడిగూడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మాదిగలతో సంబంధం లేకుండా ఎస్సీలోని 57 ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉప కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం, ప్రధాన కార్యదర్శి బానాల మంగేష్ డిమాండ్ చేశారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉపకులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బేడ, బుడగ జంగాలు, డెక్కలి, బైండ్ల, మోచి, సమగర మోచి, చిందులాంటి కులాల వారి బతుకులు మారలేదన్నారు. తమ పిల్లలు చదువుకోవాలంటే ఎమ్మార్వో ద్వారా కులధ్రువీకరణ పత్రాలు రావడం లేదని, ఆర్డీవో ద్వారా తీసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. నిరసన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మేడి పాపయ్య, ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు ఏర్పుల యాదయ్య, ఉప కులాల సంఘాల నాయకులు గోనె రాజు, ఎం. సాయిలు, ఎస్. విఠల్, బాలకృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న చింతల రాజలింగం, బానాల మంగేష్ తదితరులు

ఆ నియామకాలపై విచారణ జరిపించండి

బర్కత్‌పుర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో అటెండర్ పోస్టుల నియామకాల్లో జరిగిన తప్పిదాలపై విచారణ జరిపించాలని నిరుద్యోగ బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సెలెక్షన్ లిస్టులో తమ పేర్లు ఉన్నప్పటికీ అటెండర్లుగా నియమించకుండా అన్యాయం జరిగిందని వాపోయారు.

సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు కె.రమేష్, ఎస్.అనురాధ, ఎస్.వనజ మాట్లాడారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా కోర్టులో ఆఫీస్ సబార్డినేట్ (అటెండర్) పోస్టుల నియామకానికి దరఖాస్తు చేసుకున్నామని, 92 పోస్టులకు 81 మందిని సెలెక్షన్ లిస్టులో ప్రకటించారని తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అయిన తర్వాత కేవలం 63 మందికి జనవరి 12న అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చారని పేర్కొన్నారు. మిగతా వారికి నిలిపివేశారని, దీనిపై కోర్టుకు వెళ్లి అడగగా లోకల్, నాన్‌లోకల్ సమస్య వల్ల అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వలేదని చెప్పారని, దీంతో సెలెక్ట్ అయిన 18 మంది నష్టపోయారని వాపోయారు. వారందరికీ వెంటనే అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న బాధితులు రమేష్, అనురాధ తదితరులు

భగత్‌సింగ్ ఆశయ సాధనకు విద్యార్థులు కృషి చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రచయిత కాత్యాయని, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ తదితరులు

నల్లకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ ఆశయ సాధనకు విద్యార్థులు కృషి చేయాలని జార్జిరెడ్డి జీవనరేఖలు పుస్తక రచయిత కాత్యాయని అన్నారు. సిలబస్‌లో భగత్‌సింగ్ జీవిత చరిత్రను పునరుద్ధరించాలన్నారు. ఈనెల 31వ తేదీన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్థంతి సందర్భంగా సోమవారం విద్యానగర్‌లో మార్క్స్ భవన్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ), ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, నగర అధ్యక్షుడు గడ్డం శ్యామ్, ప్రధాన కార్యదర్శి కాంచనపల్లి శ్రీనివాస్, నాయకులు గౌతమ్, ఆసిఫ్, గణేష్, చరణ్, రామాంజనేయులు, సాయికృష్ణ, జీవన్ పాల్గొన్నారు.

తాగిన మత్తులోనే హత్య?

చిక్కడపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లి మీనాక్షి హోటల్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై వృద్ధుడిని శనివారం రాత్రి తాగిన మత్తులో ఓ వ్యక్తి బండరాయితో మోది హత్య చేసినట్లు తెలిసింది. కేసు దర్యాప్తులో పోలీసులు వివరాలు సేకరించినట్లు, హంతకుడిని మంగళవారం పట్టుకుని రిమాండ్‌కు తరలిస్తారని సమాచారం.

అప్పు తీర్చమన్నందుకు హత్య

చార్మినార్ మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు తిరిగి చెల్లించమని అడిగిన వ్యక్తిని కత్తితో పొడిచి చంపాడు ఓ వ్యక్తి. పీర్జాదిగూడకు చెందిన చమహమ్మద్ వాజిద్ (26) మొబైల్ టెక్నీషియన్. కొద్దిరోజుల క్రితం ఆగా కాలనీ కిచెందిన ఈసా అనే వ్యక్తికి రూ.4 లక్షలు అప్పు ఇచ్చాడు. అప్పు తీసుకున్న డబ్బులు ఇవ్వడం లేదని మహమ్మద్ వాజీద్ సోమవారం మధ్యాహ్నం ఈసా ఇంటికి వెళ్లాడు. డబ్బుల విషయమై ఇద్దరూ గొడవపడ్డారు. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో కోపోద్రిక్తుడైన ఈసా తన వద్ద ఉన్న కత్తితో వాజిద్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. వాజిద్ సోదరుడు ఇబ్రహీం ఫిర్యాదు మేరకు మీర్‌చౌక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కళాకారులను సత్కరించిన అతిథులు

శాస్త్రీయ, జానపద కళలు దేశ వారసత్వ సంపద

రవీంద్రభారతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ, జానపద కళలు మనదేశ వారసత్వ సంపద అని మాజీ ఎంపీ డా.వేణుగోపాలచారి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో సృజన ఆర్ట్ థియేటర్స్ 34వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన చిన్నారి కళాకారులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేయాలని, కళలపట్ల ఆసక్తి కలిగించాలన్నారు. విద్యతోపాటు కళ, క్రీడారంగాల్లో రాణించేందుకు ప్రోత్సహించాలని సూచించారు. సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాట్య గురువు ఝాన్సీరాం, హరిణి కందాళ, స్వరాజ్యలక్ష్మి, రాధికా శ్రీనివాస్, సృజన సంస్థ అధ్యక్షుడు పురుషోత్తం నారగొని తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు చిన్నారి కళాకారులు నాట్యం ప్రదర్శించారు.

అటెన్షన్.. ఎలక్షన్

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన సువిధ ఫెసిలిటేషన్ సెంటర్, ఎంసీసీ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి సందర్శించారు. ఉల్లంఘన ఫిర్యాదులపై తీసుకునే చర్యలు, కేసుల నమోదు తదితర వివరాలను ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి వారికి వివరించారు. అలాగే, మరో సమావేశంలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ.. ఈనెల 23లోగా ఆయుధాలను ఆయా పోలీస్‌స్టేషన్లలో జమ చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

ఎన్నికల ప్రవర్తనా నియామళిని పకడ్బందీగా అమలు చేయాలని హైదరాబాద్, మేడ్చల్ కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, గౌతమ్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయనున్న సువిధ సెంటర్, మానిటరింగ్ సెల్ గదులను సోమవారం అనుదీప్ పరిశీలించారు. మేడ్చల్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గౌతమ్ మాట్లాడుతూ.. ఆదివారం నుంచే ఎన్నికల వ్యయం లెక్కల్లోకి వస్తుందని తెలిపారు.

కట్టుదిట్టమైన భద్రత : సీపీ తరుణ్ జోషి

లోక్‌సభ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సిబ్బందిని రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా సోమవారం డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులతో వీడియో సమీక్ష నిర్వహించారు. చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు.

రూ. 1.05 లక్షలు స్వాధీనం

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా నగరవ్యాప్తంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మూడు కమిషనరేట్ల పరిధుల్లోని పలు ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో కలిసి చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రెండో రోజు తనిఖీల్లో రూ. 1.05 లక్షలు, రూ. 15.68 లక్షల విలువైన ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు.

నాలాల్లో చెత్తాచెదారాన్ని తొలగించండి



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లావణ్య

గోల్నాక, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలని కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ అధికారులకు సూచించారు. సోమవారం గోల్నాక డివిజన్‌లో నాలాలను ఆమె పరిశీలించారు. నాలాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో నీటి ప్రవాహం సరిగా జరగడం లేదని, దోమల బెడదతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): యువతులు, మహిళలు, గృహిణులు స్వయం ఉపాధి పొందేందుకు పలు కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని మదర్ రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి శశివంధ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, మేకప్, హెయిర్ డ్రెసింగ్ మెహందీ, ఫ్యాషన్ డీజైనింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 25వ తేదీలోపు మెహిదీపట్నం, విద్యానగర్‌లో తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9849095514 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

చిన్నారి కాలేయ మార్పిడికి ఆర్థిక సహాయం



చిన్నారి తండ్రికి చెక్కు అందజేస్తున్న పవన్‌రెడ్డి

బర్కత్‌పుర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చిన్నారి కాలేయ మార్పిడికి బీజేపీ నాయకుడు బి.పవన్‌రెడ్డి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన భరత్ కుమార్ పద్మారావునగర్‌లో నివసిస్తూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. అతడి మూడున్నరేళ్ల కుమార్తె బండారు సీతాన్వితకు రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రిలో కాలేయ మార్పిడి చేశారు. కాలేయ మార్పిడికి రూ. 22 లక్షల ఖర్చయింది. ఈ విషయం తెలుసుకున్న బి. పవన్‌రెడ్డి సోమవారం బర్కత్‌పుర కార్యాలయానికి చిన్నారి తండ్రి భరత్‌కుమార్‌ను పిలిపించి లక్ష రూపాయల చెక్కు అందజేశారు. చిన్నారి కోలుకున్న తర్వాత పదో తరగతి వరకు ఉచితంగా చదివిస్తానని హామీ ఇచ్చారు. భరత్‌కుమార్ పవన్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన



ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో శివలింగం, ఇతర విగ్రహాలను ప్రతిష్ఠించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, ఆలయ కమిటీ ఛైర్మన్ ఎస్.గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

నమో యాప్ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా గీతామూర్తి



బర్కత్‌పుర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నమో యాప్ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా కాచిగూడకు చెందిన కె.గీతామూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కె.గీతామూర్తి మాట్లాడుతూ.. ప్రజల నుంచి మైక్రోడొనేషన్స్ సేకరించడానికి నమో యాప్ కమిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. బేటీ బచావో, స్వచ్ఛభారత్, కిసాన్ సేవా కార్యక్రమాలకు ప్రజలు తమవంతు విరాళాలు అందించాలని కోరారు.

నాటి, మేటి నటుల పాటలతో గాయకుల సందడి

చిక్కడపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నాటి, మేటి నటులు శోభన్‌బాబు, కృష్ణంరాజు, కృష్ణ నటించిన చిత్రాలలోని పాటలతో గాయనీగాయకులు సందడి చేశారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ విజయ క్రియేషన్స్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో పేరి నాగేశ్వరరావు, విజయలక్ష్మి, టీఎస్‌రావు, లలిత తదితరులు పాటలు పాడారు. కార్యక్రమంలో గాయకుడు త్రినాథరావు, కళాభిమాని పేరి కామేశ్వరరావు, వై. మణిదీప్, కందల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

బర్కత్‌పుర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిగూడ ప్రాంతానికి చెందిన ఇంద్రశేఖర్ సోమవారం ఉదయం కాచిగూడ సీసీ షరాఫ్ ఆస్పత్రి సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో ముషీరాబాద్ డిపోకు చెందిన బస్సు అఫ్జల్‌గంజ్ నుంచి కుషాయిగూడ వెళ్తోంది. రోడ్డు దాటుతున్నా బస్సు ఆపడం లేదని ఇంద్రశేఖర్ బస్సును ఆపి డ్రైవర్ సురేష్‌పై దాడి చేశాడు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఇంద్రశేఖర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెంగల్‌పట్టు రైలులో చోరీలు

బర్కత్‌పుర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చెంగల్‌పట్టు రైలులో చోరీలు జరిగాయి. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట ప్రాంతానికి చెందిన రవీందర్ భార్య ఉజ్వల(47) చెంగల్‌పట్టు నుంచి చెంగల్‌పట్టు రైలులో కాచిగూడ వస్తోంది. మార్గమధ్యంలో డోన్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఎస్ - 9 బోగీలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి ఉజ్వల మెడలో ఉన్న 27.5 గ్రాముల బంగారు ఆభరణాలను లాక్కొని పారిపోయారు.

బాధితురాలు సోమవారం రాత్రి కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కర్నూల్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశామని తెలిపారు.

మరో సంఘటనలో..

అమీర్‌పేట డీకే రోడ్డు ప్రాంతానికి చెందిన శ్రీరామమూర్తి భార్య ఆర్.నళిని (65) ఆదివారం రాత్రి చెన్నై నుంచి చెంగల్‌పట్టు రైలులో కాచిగూడ వస్తోంది. మార్గమధ్యంలో డోన్ రైల్వేస్టేషన్ సమీపంలో ఎస్-10 బోగీలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి నళిని మెడలో ఉన్న 25 గ్రాముల బంగారు ఆభరణాలను లాక్కొని పారిపోయారు. బాధితురాలు సోమవారం రాత్రి కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కర్నూలు రైల్వే పీఎస్‌కు బదిలీ చేశారు.